కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -227 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 28-08-2026 శుక్రవారం పేజీలు : 4

# గులాబీలో మళ్లీ గుబులు!



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు, కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవలే మెదక్ ఎమ్మెల్యేలతో హరీశ్ రావు మీటింగ్ పెట్టారని ఈ మీటింగ్ లో కేసీఆర్ ఎన్టీఆర్ లా పెద్ద మనిషి. కానీ ఆయన కొడుకు వారసత్వం ఇవ్వడం సరికాదని హరీశ్ రావు అన్నట్లు ఆ మీటింగ్ లో ఉన్న ఒక ఎమ్మెల్యేనే నాకు ఈ విషయం చెప్పారని కవిత ఆరోపించారు. ఎన్టీఆర్ పేరు తీసుకున్నారంటే గుంటనక్క వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందని హరీశ్ రావును ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు.

మిగతాది 2 లో..

- కేసీఆర్‌కు వెన్నుపోటు కుట్ర?
- హరీశ్ సీక్రెట్ మీటింగ్!
- బీజేపీతో హరీశ్ మిలాఖత్!
- ఆర్ఎస్ఎస్ నేతతో రహస్య భేటీ
- లండన్ భేటీపై కవిత సంచలన ఆరోపణ
- రూ.960 కోట్ల పాల వ్యాపారమా?
- క్విడ్ ప్రో కోపై కవిత ఫైర్
- ఆంధ్రా పెత్తనంపై కవిత ఆగ్రహం
- యాదాద్రి బోర్డుపై కీలక డిమాండ్

# హరీశ్ రావు అరెస్ట్

కలెక్టరేట్ వద్ద హైటెన్షన్
బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
విద్యార్థులకు హరీశ్ మద్దతు
పోలీసులతో వాగ్వాదం
సుబేదారి స్టేషన్‌కు తరలింపు
జీవో 97పై విద్యార్థుల నిరసన
కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఫైర్



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** హన్మకొండ కలెక్టరేట్ ప్రాంగణం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలపడంతో పాటు, ధర్నా నిర్వహిస్తున్న టీఎన్జీఓ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన హరీష్ రావు.. సుబేదారి పోలీస్ స్టేషన్ కు నడుచుకుంటూ వెళ్లారు.

2 లో

# గవర్నర్‌ను పరామర్శించిన సీఎం



2 లో

**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి లో చేరిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చికిత్స అనంతరం గురువారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

# 2036 ఒలింపిక్స్‌పై మోదీ పిలుపు

క్రీడలే వ్యక్తిత్వ వికాసం
యువతపై మోదీ ఫోకస్
టాలెంట్ హంట్‌కు పిలుపు
స్పోర్ట్స్ సెంటర్ల ఏర్పాటు
విభిన్న క్రీడల్లో రాణించాలి
తెలంగాణలో ఖేలో ఇండియా
నాలుగు జిల్లాల్లో పోటీలు



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** జాతీయ క్రీడా దినోత్సవం 2026 సందర్భాన్ని పురస్కరించుకుని “ఖేల్ కీ బాత్.. పీఎం కే సాత్” కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న యువత, అథ్లెట్లతో వర్చువల్‌గా ముఖాముఖి నిర్వహించారు.

2 లో

# ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ




2 లో

బస్సులో రూ.50 లక్షల బంగారం మాయం!
300 గ్రాముల బంగారంపై కన్నేసిన దొంగలు!
బస్సులో బ్యాగ్ మాయం.. పోలీసుల దర్యాప్తు!
టంగుటూరులో బంగారం చోరీ కలకలం!
పెళ్లి నగలు పోయాయ్.. ప్రయాణికుడికి షాక్!
సీసీ కెమెరాలు లేవు.. దొంగతనంపై అనుమానాలు!
రూ.50 లక్షల చోరీ.. బస్సు మొత్తం తనిఖీ!

# దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం,
## రాగి తీసి దేశ సంపదను పెంచుదాం

కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సీఎం ప్రారంభించారు అనంతరం ఖనిజ అన్వేష ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పనుల పర్యవేక్షణ కోసం అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు., స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు.



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- దేవదుర్గ లో కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం
- దేవదుర్గ లో సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం
- స్థానికుల సహకారంతో త్వరితగతిన ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి.

2 లో

# పూజల పేరుతో పైశాచికం

బాలికపై దొంగబాబాల దారుణం!
ఐశ్వర్యం పేరుతో బాలికకు నరకం!
మూఢనమ్మకాల ముసుగులో అరాచకం!
దొంగబాబాల బాగోతం బట్టబయలు!
గుప్త నిధుల పేరుతో ఘోరం!
పూజల పేరుతో బాలికపై వేధింపులు!
పోక్సో కేసు.. దొంగబాబాల కోసం గాలింపు!

2 లో

# జనగణనకు తెలంగాణలో లైన్ క్లియర్

గెజిట్ పునఃప్రచురణకు ఆదేశం
40 వివరాల సేకరణకు ఏర్పాట్లు
కులం, ఉపకులాల నమోదు
సెప్టెంబర్‌లో జనగణన ప్రారంభం
ఎన్యూమరేటర్లకు కీలక బాధ్యత
ఆగస్టు 17 నుంచే సెల్ఫ్ ఎన్‌రోల్‌మెంట్




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ‘జనగణన-2027’ ప్రక్రియకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

2 లో

# యూపీలో ఎంఐఎం ఎంట్రీ ఖాయం

మాది ఓట్లు చీల్చే పార్టీ కాదు!'
యూపీ బరిలో ఎంఐఎం.. ఒవైసీ క్లారిటీ!
ప్రత్యర్థులకు ఒవైసీ స్ట్రాంగ్ కౌంటర్!
యూపీలో ఎంఐఎం దూకుడు.. గెలుపుపై ధీమా!
'ఎంఐఎం ఓట్లు చీల్చదు'.. ఒవైసీ ఫైర్!
యూపీ ఎన్నికలపై ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!
ప్రత్యామ్నాయ శక్తిగా ఎంఐఎం.. ఒవైసీ!

2 లో

# మోదీకి ఖర్గే కీలక లేఖ

డీలిమిటేషన్‌పై ఖర్గే డిమాండ్లు!
మోదీకి ఖర్గే కీలక లేఖ!
డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ డెడ్‌లైన్!
543 సీట్లు.. 25 ఏళ్లకు ఖర్గే డిమాండ్!
డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీకి పిలుపు!
మహిళా రిజర్వేషన్లపై ఖర్గే డిమాండ్!
డీలిమిటేషన్‌పై బుల్డోజర్ నిర్ణయాలు వద్దు!
మోదీ ముందు ఖర్గే 3 డిమాండ్లు!

2 లో

# దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం, రాగి తీసి దేశ సంపదను పెంచుదాం

మొదటి పేజీ తరువాయి

ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు. దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సిఐ గా పని చేసిన పని చేశానని ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్ గా ఇక్కడ బంగారం రాగి కనీసం పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు

**రాయచూర్ లో బంగారం, రాగి ఖనిజ బ్లాకును పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క :** లింగదహళ్ళి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు మరియు స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు మరియు కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్ళి గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జిఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# హరీశ్ రావు అరెస్ట్

బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

హరీశ్ రావును అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు శాంతియుతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాలతో నిర్బంధాలకు పాల్పడుతోందని, గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. ఈ ఘర్షణతో హన్మకొండ కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం (జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ) ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, టీఎస్జీఓలు కూడా ధర్నా నిర్వహించాయి. తొలుత హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఉదయాన్నే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే.. అన్ని ఆంక్షలను దాటుకుని హరీశ్ రావు హనుమకొండ కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. హరీశ్ రావు రాకతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడి నుండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# 2036 ఒలింపిక్స్‌పై మోదీ పిలుపు

మొదటి పేజీ తరువాయి

'ఖేలో ఇండియా సంవాద్' పేరిట నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమంలో దేశంలోని 1,500కు పైగా కాలేజీల విద్యార్థులు నేరుగా పాలుపంచుకున్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ మరియు దేశాభివృద్ధిలో యువత పాత్రపై ప్రధాని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

దేశ ప్రజలకు, క్రీడాకారులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ కృషిని గుర్తుచేస్తూ.. వందేళ్ల క్రితం భారత హాకీ జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన వైనాన్ని, ఇటీవల తాను న్యూజిలాండ్ వెళ్లినప్పుడు కూడా ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసినట్లు పేర్కొన్నారు. "ఆటలంటే కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదు; అవి వ్యక్తిత్వాన్ని, కుటుంబాన్ని, రాష్ట్రాన్ని మరియు దేశాన్ని వికసింపజేస్తాయి. క్రీడలు చాంపియన్లనే కాకుండా ఉత్తమ పోటీదారులను తయారుచేస్తాయి. కిందపడినా తిరిగి లేచి గెలిచే దృఢ సంకల్పాన్ని ఇస్తాయి" అని ప్రధాని ఉద్ఘాటించారు. 2012 ఒలింపిక్స్‌లో భారత్ కేవలం 12 రకాల ఆటల్లో మాత్రమే ప్రాతినిధ్యం వహించిందని, ఆ సమయంలో కొన్ని ఆటల పేర్లు కూడా చాలామందికి తెలియదని గుర్తుచేశారు. భారత్‌కు సుదీర్ఘ కోస్తా తీరం, మంచు పర్వతాలు ఉన్నందున సర్ఫింగ్, వింటర్ స్పోర్ట్స్ వంటి విభిన్న క్రీడల్లోనూ మన యువత ప్రావీణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రధాని తెలిపారు. 5 నుండి 15 ఏళ్ల వయస్సు గల చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి 'టాలెంట్ హంట్' చేపట్టాలని సూచించారు. దేశంలో అత్యాధునిక స్పోర్ట్స్ సెంటర్లను నెలకొల్పుతున్నామని, స్పోర్ట్స్ సైన్స్, కోచింగ్ మెళకువలను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్

రాబోయే డిసెంబర్‌లో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ తెలంగాణ వేదికగా జరగనున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలను వైభవంగా నిర్వహించనున్నారు. క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.

# మోదీకి ఖర్గే కీలక లేఖ




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే నియోజకవర్గాల పునర్విభజన వంటి సున్నితమైన అంశంపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందడుగు వేయకూడదని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లును బలవంతంగా తీసుకురావొద్దని నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డీలిమిటేషన్ పై ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నారనే చర్చ నేపథ్యంలో తాజాగా మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ పార్టీ తరఫున మూడు స్పష్టమైన డిమాండ్లను ప్రధాని ముందుంచారు.

కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్లు:

ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మార్చకుండా మరో 25 సంవత్సరాల పాటు ఇలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల ప్రాతినిధ్యంలో ఎలాంటి మార్పులు చేయకుండా ప్రస్తుత సంఖ్యనే మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలన్నారు. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల నాటికే చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావాలని ఖర్గే డిమాండ్ చేశారు. గతంలో ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసిన విధంగా బుల్డోజర్ తరహా నిర్ణయాలను మళ్లీ పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. ఈ విషయంలో జులై 16, 2026న తాను రాసిన లేఖను కూడా ఖర్గే గుర్తు చేస్తూ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. హర్యానాలో ప్రముఖ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి విచ్చేసి.. అక్కడి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడటంతో పాటు.. వారిని ఉద్దేశించి డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్ ఇవ్వాల్సిందిగా సదరు యూనివర్సిటీ కేటీఆర్ ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్ కు లేఖ రాశారు. ఆయన రాకతోపాటు.. ఆలోచనలు విద్యార్థులకు ఇచ్చే ప్రసంగం ఎంతో స్ఫూర్తినిస్తాయని, వారిలో ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్ కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టీ సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో తెలిపారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. భారత రాజ్యాంగానికి ఆమోదం లభించి.. 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రాజ్యాంగ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

2009లో స్థాపించిన ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రస్తుతం దేశంలోని వివిధ విభాగాల, పరిశోధనాధారిత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్--2024లో గోల్డ్ రేటింగ్ పొందడంతో పాటు, క్యూఎస్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో వివిధ విభాగాల్లో ప్రముఖ స్థానాలు దక్కించుకుంది. 2020లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నుంచి 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' హోదాను కూడా పొందింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# పూజల పేరుతో పైశాచికం




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** గుప్త నిధులు, ధన లాభం వస్తుందంటూ మూఢనమ్మకాల పేరుతో ఒక మైనర్ బాలికపై దొంగ బాబాలు దారుణానికి ఒడిగట్టారు. పూజల పేరుతో బాలికను పలుమార్లు వివస్త్రను చేసి, అసభ్యకరంగా తాకుతూ నరకయాతనకు గురిచేసిన దిగ్భ్రాంతికర సంఘటన అనంతపురంలో వెలుగు చూసింది. ఈ ఘటనపై పోలీసులు ఐదుగురు నిందితులపై పోక్సో సహా వివిధ తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తికి మహాలక్ష్మి అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అతనికి ఉన్న హోటల్ వ్యాపారంలో భారీగా లాభాలు వస్తాయని, లక్ష్మీదేవి కటాక్షిస్తుందని నమ్మబలికిన మహాలక్ష్మి.. అందుకోసం ప్రత్యేక పూజలు చేయాలని సూచించింది. పూజలో భాగంగా అతని మైనర్ కుమార్తెను వివస్త్రగా కూర్చోబెడితే కోరుకున్న ఐశ్వర్యం సొంతమవుతుందని మాయమాటలు చెప్పింది. మొదట ఆ తండ్రి ఒప్పుకోకపోయినా, మహాలక్ష్మి పదే పదే నమ్మబలకడంతో చివరకు అంగీకరించాడు.

6 నెలలుగా మూఢనమ్మకాల పేరుతో నరకం..

బాధితురాలిని ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లిన హేమంత్ అనే దొంగ బాబా. ఆమెను వివస్త్రగా చేసి పూజల పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా పూజలు ఫలించలేదనే సాకుతో ఈ నెల 8న తన కుమారుడు బాలసుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ అనే వ్యక్తులతో కలిసి మళ్లీ బాలికను వివస్త్రను చేసి పూజలు నిర్వహించారు. అయినా ఫలితం రాలేదని చెప్పి.. ఈ నెల 9న బాలికను, ఆమె తల్లిని కడపలోని వెంకటేష్ యాదవ్ అనే మరో దొంగ గురువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల పేరుతో బాలికను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. ఈనెల 11న మరోసారి పూజలు చేయాలంటూ బాలికను నిందితులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్తుండగా, స్థానికులు గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు.

విషయం తెలిసి భయాందోళనకు గురైన దొంగ బాబాలు, బాలికను ఆమె తల్లిని కారులో నుంచి దింపేసి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడప జిల్లా వల్లూరు పోలీసులు మొదట జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదనంతరం బుధవారం రోజున ఈ కేసును ఘటన పరిధిలోకి వచ్చే అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషనకు బదిలీ చేశారు. ఈ దారుణానికి పాల్పడిన దొంగ బాబాలు హేమంత్. బాలసుబ్రహ్మణ్యం, వెంకటేష్ యాదవ్‌తో పాటు వీరికి సహకరించిన మహాలక్ష్మి.. సాయి ప్రణవ్‌లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

# ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** ప్రకాశం జిల్లా టంగుటూరు సమీపంలో కావేరి ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ కలకలం రేపింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న బస్సులో ఓ ప్రయాణికుడికి చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన 300 గ్రాముల బంగారం చోరీకి గురైంది. దీంతో ప్రయాణికుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. వివాహ కార్యక్రమం కోసం వెంకట కృష్ణ అనే వ్యక్తి బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్నాడు. అతడు కావేరి ట్రావెల్స్ బస్సులో బంగారు నగలతో కూడిన బ్యాగును వెంట తీసుకెళ్తున్నాడు. టంగుటూరు సమీపానికి చేరుకునే సమయానికి బ్యాగు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే వెంకట కృష్ణ టంగుటూరు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కావేరి ట్రావెల్స్ బస్సును టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బస్సులోని ప్రయాణికుల వివరాలు, లగేజీ, ఇతర ప్రాంతాలను పరిశీలిస్తూ చోరీకి సంబంధించి ఆధారాలను సేకరిస్తున్నారు.

ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ఇతర ప్రయాణికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేయాల్సిన సీసీ కెమెరాలు లేకపోవడం వల్లే చోరీకి అవకాశం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ జరిగిన సమయంలో బస్సులో ఎవరెవరు ప్రయాణించారు?.. బంగారం ఉన్న బ్యాగును ఎవరు తీసుకెళ్లారు?.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు అధికారులకు సవాల్‌గా మారింది.

# గవర్నర్‌ను పరామర్శించిన సీఎం



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి లో చేరిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చికిత్స అనంతరం గురువారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం రాత్రి యశోద ఆస్పత్రి నిపుణులైన వైద్యుల బృందం గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు గుండె సంబంధిత శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. కాగా, గురువారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను నేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా పూర్తి కోలుకోవాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే.

# జనగణనకు తెలంగాణలో లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోంశాఖ ఆగస్టు 14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 4505(ఈ)ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పున:ప్రచురించాలని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనకు అధికారికంగా మార్గం సుగమమైంది. అయితే, జనగణన జనాభా లెక్కింపు విడతలో పౌరుల నుంచి మొత్తం 40 రకాల వివరాలను సేకరించాలని కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. 1948 సెన్సస్ చట్టంలోని నిబంధనల ప్రకారం నియమించబడే ఎన్యూమరేటర్లు ఇళ్లకు వెళ్లి ఈ వివరాలను సేకరించేందుకు అధికారం కల్పించారు.

ఇప్పటికే 40 ప్రశ్నలకు నోటిఫై చేసిన కేంద్రం

అయితే, జనగణనలో అడిగే 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటిఫై చేసింది. వాటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. జన గణన ప్రక్రియ సెప్టెంబర్ 1న ప్రారంభమై సెప్టెబర్ 30తో ముగియనుంది. అంతకు ముందే ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

# యూపీలో ఎంఐఎం ఎంట్రీ ఖాయం




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (బిఎన్ఎస్):** ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని, అయితే ఎన్ని స్థానాల్లో బరిలోకి దిగుతామనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. యూపీలో ఎంఐఎం సంస్థాగతంగా మునుపటి కంటే చాలా పుంజుకుందని అన్నారు. ఈసారి గతంలో కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ స్థానాల్లో, ఎంతమంది అభ్యర్థులను నిలబెడతామనే వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు.

'ఓట్లు చీల్చే పార్టీ' ప్రచారంపై ఫైర్..

ఏఐఎంఐఎం పార్టీపై నిరంతరం ఓట్లు చీల్చే పార్టీ అంటూ వస్తున్న ఆరోపణలను అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అసత్య ప్రచారాల ద్వారా ఎన్డీయే అధికారంలోకి వస్తుందనే భ్రమలను కల్పించేందుకు ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కొందరు నాయకులు వల్లించే లౌకికవాదానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు ఎలాంటి సంబంధం లేదని అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఏఐఎంఐఎం..

ప్రజలు ఇప్పుడు తమ స్వంత రాజకీయ నాయకత్వాన్ని బలపరుచుకోవాలనే నిశ్చయంతో ఉన్నారని, ఏఐఎంఐఎం ఓ బలమైన ప్రత్యామ్నాయంగా మారుతోందని అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల ఫలితాలు ఈ ఆలోచనకు మరింత బలాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. రాబోయే ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఎంఐఎం నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తారని అసదుద్దీన్ ఒవైసీసీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గులాబీలో మళ్లీ గుబులు!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తన హస్తగతం చేసుకొని ఆ తర్వాత బీజేపీ సపోర్ట్ తీసుకోవాలని కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీతో హరీశ్ రావు మిలాఖత్ ఉందని చెప్పటానికి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయన్నారు.

**ఆర్ఎస్ఎస్ ప్రముఖుడితో మంతనాలు:**

రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్ లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయని ఆ రోజు హరీశ్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకోని ఆయనతో మీటింగ్ పెడతారని కవిత ఆరోపించారు. తాను ఇప్పుడు బీఆర్ఎస్ లో లేనని ఆ పార్టీ ఎలా పోయినా నాకు సంబంధం లేదు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే గుంటనక్క గురించి తెలియాలని ఈ విషయాలన్నీ చెబుతున్నానన్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రితో కచ్చితంగా హరీశ్ రావుకు లాలూచీ ఉందన్నారు. అందువల్లే తెలంగాణ ప్రయోజనాలను ముఖ్యమంత్రి తాకట్టు పెడుతున్నప్పటికీ బీఆర్ఎస్ మాట్లాడటం లేదని విమర్శించారు. కొద్ది రోజుల క్రితమే లండన్?లో సీఎంరేవంత్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మీటింగ్ జరిగిందన్నారు. నిజంగా లండన్ లో ఈ ఇద్దరి మధ్య లాలూచీ లేకపోతే హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఇక ఆంధ్రావాళ్లతో కేటీఆర్ కు వ్యాపార సంబంధాలు, దోస్తులు ఉండటంతో ఆయన మాట్లాడటం లేదని కవిత ఆరోపించారు.

**మంత్రిగా ఉంటూ ఆంధ్రావాళ్లతో వ్యాపారం:** ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్ రావు కార్పొరేట్ సంస్థలతో పాల వ్యాపారం చేశారని ఒక్క నారాయణ, చైతన్య కాలేజ్ లకే నెలకు 5 కోట్ల చొప్పున 8 ఏళ్లుగా 960 కోట్ల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇంకా కార్పొరేట్ హాస్పిటల్స్ కిమ్, కామినేని, యశోద వంటి హాస్పిటల్స్ తోనూ పాల వ్యాపారం చేశారన్నరు. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉంటూ ఇలా ఆంధ్రావాళ్లతో పాల వ్యాపారం చేయటం క్విడ్ ప్రో కో కాదా? అని ప్రశ్నించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడిందని, పాల వ్యాపారం ఒకరికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకరికి, ఇసుక వ్యాపారం ఒకరికి అన్నట్లు పంచుకొని దోచుకున్నారని ఆరోపించారు.

**ఆంధ్రా హీరో భార్యకు యాదాద్రి బోర్డు మెంబరా?:** రేవంత్ రెడ్డి అంటే అనుముల రేవంత్ రెడ్డి కాదు ఆంధ్రా రేవంత్ రెడ్డి అని విమర్శించారు. బ్రాహ్మణ పరిషత్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఆంధ్రా వాళ్లకు ఇచ్చారు. అంటే తెలంగాణలో బ్రాహ్మణ మేధావులు లేరా? పొలిటికల్ పదవులు కచ్చితంగా తెలంగాణ వాళ్లకే ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాసరావు పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ వాదులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని గుర్తుచేశారు. పేద బ్రాహ్మణులకు మేలు చేయాల్సిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆంధ్రా రౌడీలకు అడ్డాగా మారిందని దళిత మహిళలను, తెలంగాణ వాళ్లను బసవరాజు శ్రీనివాసరావు ఇష్టమొచ్చినట్లు తిట్టాడని ఆరోపించారు. వెంటనే ఆంధ్రా వాళ్లకు ఇచ్చిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను తొలగించి తెలంగాణ వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భక్తుల పైసలతో కట్టిన యాదాద్రి గుడిలో మెంబర్ గా ఆంధ్రా హీరో భార్యకు అవకాశం కల్పించారని తిరుపతి బోర్డులో మనవాళ్లకు అవకాశం కల్పించటమంటే అక్కడ మనవాళ్ల పైసలు కూడా ఉంటాయన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి తెలంగాణ సోయి ఉంటే బ్రాహ్మణ పరిషత్‌లో యాదాద్రి గుడి బోర్డులో ఉన్న ఆంధ్రావాళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

# ఉల్లితో కన్నీరు.. మిరపతో మంట



కొత్తపేట (బిఎన్ఎస్ )ఆగస్టు 27: రాష్ట్రంలో నిత్యావసరాలు కంటతడి పెట్టిస్తున్నాయి. ప్రధానంగా ఉల్లి, మిరప వంటనూనెలు ధరలు గత ఏడాదితో పోల్చి చూస్తే భారీగా పెరిగిపోయాయి. గత అగస్ట్ నెల్లో ఇదే రోజున ఉన్న ధరలకూ ఈ నెల్లో ఇదే రోజు ధరలకూ భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఉల్లి ధర ఏకంగా 83 శాతం వరకు పెరుగుదల నమోదుకాగా, ఎండుమిరప ధర కూడా 54 శాతం వరకు పెరుగుదల కనిపించింది. ప్రణాళికా శాఖ నివేదికలో ఇతర నిత్యావసరాలు కూడా పెరిగినట్టు తేలింది.

పెరుగుతున్న ధరలు వినియోగదారులపై భారం పెంచుతున్నాయి. ముఖ్యంగా ఎండుమిరపకాయలు, ఉల్లిపాయలు, వంట నూనెలు, కందిపప్పు ధరలు ఏడాది కాలంలో గణనీయంగా పెరిగాయి.గత నెలతో పోల్చిచూసినా పెరుగుదల ఎక్కువగానే కనిపిస్తోంది. ధరల పెరుగుదలలో ఎండు మిరపకాయలు ముందంజలో ఉన్నాయి. గ్రేడ్-1 మిరపకాయ కిలో ధర 282.39 రూపాయలుగాగా నమోదైంది. గత ఏడాది ఇదే రోజున 176.55 మాత్రమే ఉండగా, ఏడాది కాలంలో 112.24 రూపాయల వరకు పెరగడం గమనార్హం. ఇది ఏకంగా 63.57 శాతంగా ఉంది. గ్రేడ్-2 మిరపకాయ ధర 253.35గా ఉండగా, ఏడాదిలో 65.81 శాతం పెరిగింది.

**ఉల్లి ధరల్లో భారీగా**

ఉల్లిపాయల ధరలు కూడా వినియోగదారులకు గట్టి షాక్ ఇస్తున్నాయి. గ్రేడ్-1 ఉల్లి కిలో 52.62గా ఉంది. గత ఏడాది 29 రూపాయలు మాత్రమే ఉండడం విశేషం. ఏడాది కాలంలో ధర 75.14 శాతం పెరిగింది. గ్రేడ్-2 ఉల్లి ధర 45.35 కాగా, గత నెలతో పోలిస్తే 37.52 శాతం, గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 83.35 రూపాయలు పెరిగింది. బయట మార్కెట్ లో అయితే కిలో 60 రూపాయలకన్నా పైనే అమ్ముతున్నారు.

**నూనెల ధరలూ పైకే..**

వంట నూనెల ధరల్లోనూ ఏడాది కాలంలో స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరుకు 177.22గా ఉండగా, ఏడాదిలో 21.40 శాతం పెరిగింది. పామాయిల్ 152.54 రూపాయలుగా ఉండగా గత ఏడాది 129 రూపాయలుగా ఉంది. వేరుశనగ నూనె 159 రూపాయలనుంచి 183.46 వరకు పెరిగింది. కందిపప్పు ధరలు కూడా వినియోగదారులపై భారంగా మారుతూన్నాయి. గ్రేడ్-1 కందిపప్పు కిలో 133.10గా ఉండగా, గత ఏడాది 117 రూపాయలు మాత్రమే ఉంది. గ్రేడ్-2 ధర 121.93 తో 14.56 శాతం పెరిగింది.

# కడపలో రాయల్ జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభం.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27: కడప నగరంలోని వైవి. స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ జ్యువెలర్స్ షోరూమ్‌ను మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులైన పీర్ భాషా గారికి శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కడపలో రాయల్ జ్యువెలర్స్ ప్రజల ఆదరణ పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్ భాష, బంగారు రాజా, రాజశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జమాల్ వలి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చాంద్ బాషా, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షఫీ, స్థానిక నాయకులు అల్లా బకాష్, ఇస్మాయిల్, సలీం, వ్యాపార ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఓబులేసు, కోడూరు సతీష్ లది హత్య కాదు... ప్రమాదవశాత్తు మరణమే..!

- **క్రైమ్ నెం. 14/2026 కేసులో నిజాలు తేల్చిన ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:

బ్రహ్మంగారిమఠం పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నంబరు 14/2026 కింద నమోదైన ఓబులేసు మరియు కోడూరు సతీష్ ల మృతి కేసులో మాదిగ దండోరా నాయకులు చేపట్టిన సుదీర్ఘ ఆందోళన నేపథ్యంలో కడపజిల్లా పోలీసులు లోతైన దర్యాప్తు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ ఆధ్వర్యంలో విచారణ అధికారిగా సమగ్ర దర్యాప్తు చేపట్టి, కేసు నిజాలను వెల్లడించారు. ఇది హత్య కాదని, ప్రమాదవశాత్తు జరిగిన మరణమేనని మైదుకూరు డిఎస్పి రాజేంద్ర ప్రసాద్ తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణ స్పష్టం చేస్తూ, ?ఫిబ్రవరి 5 న వీరిద్దరి హత్య జరిగిందనే అనుమానాలు, వినతులు మరియు మాదిగ దండోరా ఆధ్వర్యంలో జరిగిన సుదీర్ఘ ఆందోళనల నేపథ్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తు సాగింది. పోలీసు రికార్డులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, సీసీటీవీ ఫుటేజ్, పోస్టుమార్టం నివేదికలు, ఫోరెన్సిక్ మెటీరియల్, డిజిటల్ ఆధారాలతో పాటు జలవనరుల శాఖ అందించిన సాంకేతిక నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ ముగింపునకు వచ్చినట్లు అధికారుల బృందం తెలిపింది.

**పోలీస్ దర్యాప్తులో వెల్లడైన కీలక అంశాలతో పాటు ప్రత్యక్ష సాక్ష్యాలు.**

మృతు లిద్దరూ కాలువలోకి దిగే ముందు కలిసి ఉన్నారని, ఈ సంఘటనను సంతోష్ అనే వ్యక్తి ప్రత్యక్షంగా చూశాడని ఆధారాలు ధృవీకరించాయి. డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాలు బాధితులు నీటిలో ఉన్న సమయానికి సంబంధించిన థంబ్‌నెయిల్స్ డిజిటల్ ఫోరెన్సిక్ పరీక్షల్లో లభ్యమయ్యాయి. వైద్య నివేదికలు ప్రకారంగా ఇద్దరి పోస్టుమార్టం నివేదికల్లోనూ మరణానికి ముందే నీటిలో మునిగిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారని స్పష్టమైంది. సాంకేతిక నివేదికల ఆధారంగా కాలువ నీటి ప్రవాహ వేగాన్ని విశ్లేషించిన జలవనరుల శాఖ నివేదిక ప్రకారం, ఓబులేసు మృతదేహం దిగువకు కొట్టుకుపోవడం సాధ్యమేనని తేలింది. ఈ కేసులో ఎలాంటి హత్య లేదా కుట్ర కోణాలు లేవని, సేకరించిన సాంకేతిక, డిజిటల్ మరియు వైద్య ఆధారాలన్నీ ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయని అధికారులు వెల్లడించారు. అందువల్ల బాధితు లిద్దరూ ప్రమాద వశాత్తు కాలువలో మునిగిపోవడం వల్లే మృతి చెందారని దర్యాప్తులో సమగ్రంగా నిర్ధారణ అయినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

# కడప సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల కన్నుమూత...!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:

వైయస్సార్, కడపజిల్లా.. పత్రికారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల(69) గురువారం తెల్లవారుజామున 3 గంటల కు రిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో జిల్లా మీడియా రంగం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. పవన్ పంతుల సుదీర్ఘ కాలంగా జర్నలిజం రంగంలో సేవలు అందించారు. ప్రముఖ దినపత్రికలైన 'ఆంధ్రజ్యోతి', 'సాక్షి' లలో సీనియర్ జర్నలిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రజా సమస్యలపై అనేక కథనాలను అందించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. పవన్ పంతులు రాసిన కథనాలు ఎంతో మందిపై ప్రభావం చూపాయి. నిష్పాక్షికమైన వైఖరి, వృత్తిపట్ల నిబద్ధత పంతులు ప్రత్యేకతలు.

ఆయన మృతి పట్ల జిల్లాలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, తోటి జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పవన్ పంతుల మృతి పత్రికారంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ తీవ్ర సానుభూతిని తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిద్దాం.

# కమలాపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి బాధితులకు వైయస్సార్సిపి అండగా ఉంటుంది.!!

- **కమలాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి నరేన్ రామాంజుల రెడ్డి**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:

కడపజిల్లా.. కమలాపురం లో జరుగుతున్న ఆర్ఓబి నిర్మాణ పనుల ప్రాంతాన్ని వైయస్సార్ సిపి నాయకులు, బాధితులతో కలిసి కమలాపురం వైయస్సార్ సిపి ఇన్ చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి పరిశీలించారు. ఈ పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రజలందరికీ అవసరమైనది. అభివృద్ధి జరుగుతుంటే అన్ని పార్టీలు సహకరించాలన్నది వాస్తవమే, సహకరిస్తాం. కానీ ఆర్ఓబి నిర్మాణ పనుల విధానంలో అందరికీ భిన్నా భిప్రాయాలు ఉన్నాయన్నారు. బాధితులకు పరిహారం ఇవ్వకుండానే పనులు ప్రారంభించడం సరైన విధానం కాదన్నారు. 39 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు లేకుండా పనులు చేయడం దుర్మార్గం కాదా అన్నారు.

ప్రజలకు అవసరమైన సర్వీస్ రోడ్డు ను ఏర్పాటు చేసి ఆర్ఓబి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అడిగేవారు లేరని ఇష్టా రాజ్యంగా పనులు చేయడం దారుణం. నష్ట పరిహారం ఇస్తే బాధితులు తామే స్వచ్ఛందంగా వారి నిర్మాణాలు తొలగిస్తామని చెబుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు అన్నారు. గత వైయస్సార్ సిపి ప్రభుత్వ హయాంలో జరిగిన రోడ్డు పెండింగ్ పనులలో బాధితులకు పరిహారం ఇచ్చిన తరువాతే రోడ్డు పనులు చేశాం అని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసినట్లే ప్రస్తుత ప్రభుత్వం కూడా పనులు చేయాలని, ప్రజలు ఒకవైపు అడుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కావచ్చు, స్థానిక ఎమ్మెల్యే కావచ్చు, సంబంధిత బాధితులను ఆదుకోవాలని వైయస్సార్సీపి తరఫున డిమాండ్ చేస్తున్నానన్నారు. అప్పటి 2021 లో వున్న విలువ ప్రకారం బాధితులకు పరిహారం ఇస్తామంటే సరిపోదు అన్నారు. ఆర్ఓబి వర్క్ కు ఇప్పటికే నాలుగు సార్లు ఎస్టిమేషన్ వేసి రేట్లు పెంచిన మాట వాస్తవం కాదా అన్నారు. మరి బాధితులకు ఇప్పుడున్న వ్యాల్యూ ప్రకారం పరిహారం ఎందుకు ఇవ్వలేరు అని సూటిగా ప్రశ్నించారు. రేట్లు పెంచి ఇచ్చేంత వరకు బాధితులకు అండగా వైయస్సార్ సిపి పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. డీకేటి స్థలాలంటూ నష్ట పరిహారం తక్కువతో ఇచ్చి మొత్తం పడగొట్టేశారు. మానవతా దృక్పథంతో ఆలోచించి నిరాశ్రయులకుల ఇందిరమ్మ కాలనీలో ఆశ్రమం కల్పించాలన్నారు. లేదా చంద్రన్న కాలనీలని పేరు పెట్టి నిరాశ్రయులైన అభాగ్యులకు పునరావాసం కల్పించిన మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. బాధితుల డిమాండ్లు న్యాయపరమైనవి వారి కోసం ఎందాకైనా వైఎస్ఆర్సిపి తోడుగా ఉంటుందని తెలిపారు. కాబట్టి ఎలాంటి పరిస్థితుల్లోనైనా బాధితులు అధైర్య పడాల్సిన అవసరం లేదు, మీ వెంట వైఎస్ఆర్సిపి పార్టీ మరియు స్థానిక, జిల్లా నాయకులైన మేమందరం మీకు తోడుగా ఉంటామని బాధితులకు మీడియా సందర్భంగా కమలాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి నరేన్ రామాంజుల రెడ్డి తెలిపారు.

# నేత్ర దానం.. మహా దానం.. !!



నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికీ ప్రపంచాన్ని చూపించవచ్చని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రదాన పక్షోత్సవాల అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఒక వ్యక్తి మరణానంతరం నేత్ర, అవయవ దానం చేయడం ద్వారా మరి కొందరి జీవితాలను కాపాడవచ్చని అన్నారు.. పుట్టిన శిశువు నుండి అన్నీ వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్య కరమైన జీవితం అందించాలని, ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తేవాలని, కలెక్టర్ తెలిపారు. మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి -- నేత్రదానం చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,, పెండెం వెంకట రమణ మాట్లాడుతూ... నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని "నేత్రదానం చేయండి -- మరొకరికి చూపును ప్రసాదించండి" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.

# సృజనోత్సవ్‌లో SVIS ప్రభంజనం

## తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖచే ఘన సత్కారం




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన 'సృజనోత్సవ్' సాంస్కృతిక సంబరాల్లో శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (SVIS) విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో ప్రభంజనం సృష్టించారు. సాంస్కృతిక రంగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటూ పాఠశాల కీర్తికిరీటంలో మరొక ఘనతను చేర్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. రమా విశ్వనాథన్ విద్యార్థులు, శిక్షణ బృందంతో కలిసి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ అధికారుల చేతుల మీదుగా ఘన సత్కారాన్ని అందుకున్నారు.

సృజనోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన గాన పోటీలలో SVIS విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో, ఆత్మవిశ్వాసంతో పాల్గొని తమ సంగీత పటిమను ప్రదర్శించారు. పాఠశాల నుంచి హాజరైన 95 మంది విద్యార్థుల బృందంలో ఏకంగా 68 మంది విద్యార్థులు ప్రథమ బహుమతులతో సహా పలు పురస్కారాలను కైవసం చేసుకుని విశేష ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు ప్రదర్శించిన అంకితభావం, కళపై ఉన్న మక్కువ వేదికపై స్పష్టంగా కనిపించి సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు పాల్గొన్న విద్యార్థులందరి కృషిని గుర్తిస్తూ పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. బహుమతులతో సంబంధం లేకుండా వేదికపైకి వచ్చి ప్రదర్శన ఇచ్చిన ప్రతి ఒక్కరినీ విజేతగానే పరిగణిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. వేదికపై ప్రతిభను చాటేందుకు విద్యార్థులు చూపిన ధైర్యం, సన్నద్ధత మరియు విలువల ప్రాతిపదికన సంస్థకు ప్రాతినిధ్యం వహించడమే అసలైన విజయమని తెలిపింది.

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేడుకలో ఈ పురస్కారాల ప్రదానం ఎంతో వైభవంగా జరిగింది. ప్రభుత్వ ప్రతినిధులు, సాంస్కృతిక రంగ ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్న యువ విజేతలకు ఈ ఘట్టం చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది.

ఈ వేడుకల్లో శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిష్ఠాత్మకమైన 'ఉత్తమ సాంస్కృతిక బృందం' అవార్డును దక్కించుకోవడంతో ఆనందోత్సాహాలు పరాకాష్టకు చేరాయి. సంస్థాగతంగా లభించిన ఈ అరుదైన గుర్తింపు పాఠశాల ప్రతిష్టను మరింత పెంపొందించింది.

ఈ అవార్డు విద్యా భారతి పెంపొందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, సదాచారం, క్రమశిక్షణ, భక్తి, భారతీయ సంస్కృతి పట్ల గౌరవం వంటి విలువల ప్రతిరూపంగా నిలిచింది. విద్యార్థులు తమ సాంస్కృతిక మూలాలను విస్మరించకుండా, విద్యతో పాటు కళాత్మక




నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి SVIS అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి ఈ పురస్కారం నిదర్శనంగా నిలిచింది. ఈ విజయం వెనుక నిరంతరం శ్రమించిన శిక్షణ బృందాన్ని ప్రిన్సిపాల్ వై. రమా విశ్వనాథన్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తూ ప్రోత్సహించిన సంగీత ఉపాధ్యాయురాలు రంజితా మొహంతి, తబలా ఉపాధ్యాయులు నవీన్, నృత్య ఉపాధ్యాయురాలు కళ్యాణిల కృషిని కొనియాడారు. ఉపాధ్యాయుల పకడ్బందీ శిక్షణే విద్యార్థుల ప్రతిభను విజయంగా మార్చిందని పేర్కొన్నారు.

సృజనోత్సవ్‌లో లభించిన ఈ విజయం కేవలం బహుమతుల సేకరణ మాత్రమే కాదని, విద్యార్థులలోని జట్టు స్ఫూర్తి, పట్టుదల, సాంస్కృతిక స్పృహకు లభించిన గౌరవమని పాఠశాల వర్గాలు తెలిపాయి. విలువల పునాదులపై ప్రతిభను తీర్చిదిద్దినప్పుడు ప్రావీణ్యం అనివార్యమవుతుందని SVIS నిరూపించింది. ఈ ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# పెంచలకోనలో ఘనంగా శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి బాలాలయ ప్రతిష్ఠాపన పూజలు




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులకు తొలి అంకం మొదలైంది..సుమారు 6 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు.ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభ నేపథ్యంలో, అమ్మవారి నిత్య పూజలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఆలయ ప్రాంగణంలో 'బాలాలయం' నిర్మించి, అందులో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీవారి నందనవనంలో ప్రత్యేక యాగ్నిక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగాప్రారంభించారు.

**వైభవంగా ప్రత్యేక పూజలు**

గురువారం సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కింది ప్రత్యేక పూజలు మరియు హోమాలను వైభవంగా నిర్వహించారు.విశ్వక్సేన ఆరాధనపుణ్యాహవాచనం, రక్షాబంధనం ఋత్విక్ వరణం, మృత్సంగ్రహణం అంకురార్పణ వాస్తు పూజ మరియు వాస్తు హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు..ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ ఈఓ కోవూరు జనార్ధన్ రెడ్డి,ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు, ఋత్వికులు పాల్గొన్నారు.వీరితో పాటు ఆలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆవుల వినోద్ కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 23 రోజుల ఉత్కంఠకు తెర.. గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితం

- వెస్ట్ బెంగాల్ తీరంలో మత్స్యకారుల ఆచూకీ.. రెస్క్యూ చేసి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన అధికారులు

అమలాపురం, (బిఎన్ఎస్) ఆగస్టు 27 : కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనకు ఎట్టకేలకు సుఖాంతం లభించిందని, సుమారు 23 రోజుల పాటు కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన ఏడుగురు మత్స్యకారులు వెస్ట్ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామని, వారిని రెస్క్యూ చేసి సురక్షితంగా వెస్ట్ బెంగాల్ పోర్టుకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు.

గురువారం కలెక్టరేట్‌లో వివేకానంద సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, మత్స్యశాఖ జేడీ కరుణాకర్ లతో కలిసి మత్స్యకారుల గల్లంతు నుంచి వారి ఆచూకీ లభించే వరకు జరిగిన పరిణామాలను, జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను, రెస్క్యూ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు.

### ఆగస్టు 3న సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు

ఆగస్టు 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి "ముత్యాలమ్మ" అనే ఫిషింగ్ బోటు 15 రోజుల డీప్ ఫిషింగ్ కోసం సముద్రంలోకి వెళ్లిందని కలెక్టర్ తెలిపారు. అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో ఈ బోటు రిజిస్టర్ అయి ఉందన్నారు. బోటు యజమాని కోపనాటి రామకృష్ణ వర్మ అని, బోటులో మొత్తం ఏడుగురు మత్స్యకారులు క్రూ సభ్యులుగా ఉన్నారని వివరించారు.

ఆగస్టు 3వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో మత్స్యకారులు వేటకు బయలుదేరారని, అయితే అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయానికి వారి కుటుంబ సభ్యులతో కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. అప్పటి నుంచి మత్స్యకారుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని చెప్పారు.

### ఆగస్టు 14న మిస్సింగ్ ఫిర్యాదు

మత్స్యకారుల నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో ఆగస్టు 14న బోటు యజమాని సోదరుడు అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. వెంటనే మిస్సింగ్ కంప్లైంట్ నమోదు చేసి, మత్స్యకారుల ఆచూకీ కోసం వివిధ స్థాయిల్లో సమన్వయంతో చర్యలు ప్రారంభించామని చెప్పారు.

సముద్రంలో మత్స్యకారుల బోటు ఎక్కడ ఉందో గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో నిరంతరం సమన్వయం చేసినట్లు తెలిపారు.

### కోస్ట్‌గార్డ్, నేవీ సహకారంతో విస్తృత గాలింపు

మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులకు సమాచారం అందించడంతో పాటు వెస్ట్ బెంగాల్, బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దు భద్రతా విభాగాల అధికారులకు కూడా సమాచారం అందించినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.

మత్స్యకారులు సముద్రంలో ఎక్కడైనా చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉన్నందున వివిధ మార్గాల్లో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించినట్లు చెప్పారు.

### ఆగస్టు 26న లభించిన కీలక సమాచారం

23 రోజుల ఉత్కంఠ అనంతరం ఆగస్టు 26వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో మత్స్యకారుల ఆచూకీ లభించడం కుటుంబ సభ్యులకు, జిల్లా యంత్రాంగానికి ఊరటనిచ్చిందని కలెక్టర్ తెలిపారు.

వెస్ట్ బెంగాల్ తీరంలో దిగా పోర్టు నుంచి శంకర్‌పూర్ వైపు వెళ్తున్న "అరబింద బార్మన్" అనే బోటు సిబ్బంది గల్లంతైన మత్స్యకారులను గుర్తించారని చెప్పారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రెస్క్యూ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.



### ఇంజిన్ గేర్‌బాక్స్ పాడవడంతో సముద్రంలో కొట్టుకుపోయిన బోటు

మత్స్యకారులు ప్రయాణిస్తున్న "ముత్యాలమ్మ" బోటు ఇంజిన్ గేర్‌బాక్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో బోటు నియంత్రణ కోల్పోయి సముద్రంలో కొట్టుకుపోయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

బోటును గుర్తించిన అనంతరం దాదాపు 10 గంటల పాటు నిరంతరంగా రెస్క్యూ చర్యలు చేపట్టారని, అధికారులు, ఇతర బోటు సిబ్బంది సమన్వయంతో బోటును సురక్షితంగా లాగి వెస్ట్ బెంగాల్ పోర్టుకు తీసుకువచ్చారని వివరించారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో బోటును సురక్షితంగా పోర్టుకు చేర్చినట్లు అన్నారు.

### ఒకరికి స్వల్ప అస్వస్థత.. మిగిలిన వారంతా క్షేమం

రెస్క్యూ అనంతరం ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చామని కలెక్టర్ చెప్పారు . బోటు డ్రైవర్ తాతారావు కాస్త అస్వస్థతకు గురయ్యారని, మిగిలిన ఆరుగురు మత్స్యకారులు ఆరోగ్యంగా ఉన్నారన్నారు .వీరందరికీ స్థానిక మెరైన్ పోలీసుల సహకారంతో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం మత్స్యకారులందరూ వెస్ట్ బెంగాల్‌లోని బోట్ ఓనర్స్ అసోసియేషన్ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని వెల్లడించారు.

### ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కార్యాలయానికి సమాచారం

మత్స్యకారుల గల్లంతు, వారి కోసం కొనసాగుతున్న గాలింపు, అనంతరం రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి కార్యాలయానికి ముందుగానే తెలియజేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మత్స్యకారుల సురక్షిత ఆచూకీ లభించడం పట్ల ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సంతృప్తి వ్యక్తం చేస్తోందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలానికి తీసుకురావడమే ప్రస్తుతం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

### ప్రత్యేక వాహనం, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పంపిణీ

మత్స్యకారులను వెస్ట్ బెంగాల్ నుంచి కోనసీమ జిల్లాకు సురక్షితంగా తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక వాహనాన్ని పంపినట్లు కలెక్టర్ తెలిపారు. వారితో పాటు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను కూడా పంపించామని చెప్పారు.

వారి ప్రయాణం, ఆరోగ్య పరిస్థితి, అవసరమైన ఇతర సౌకర్యాలను అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తారని తెలిపారు. మత్స్యకారులు త్వరగా తమ కుటుంబ సభ్యులను కలుసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

### 15 రోజుల రేషన్‌తో వెళ్లి.. 23 రోజులు సముద్రంలో ఎలా గడిపారు?

15 రోజుల డీప్ ఫిషింగ్ కోసం అవసరమైన రేషన్‌తో సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు అనూహ్యంగా 23 రోజుల పాటు సముద్రంలో ఉండాల్సి వచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంత సుదీర్ఘ కాలం సముద్రంలో వారు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు, ఆహారం, మంచినీరు, ఇంధనం వంటి వనరులను ఎలా వినియోగించుకున్నారు, బోటులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి వంటి అంశాలను వారి నుంచి పూర్తిగా తెలుసుకోవాల్సి ఉందన్నారు.

వారి అనుభవాలను కేవలం నమోదు చేయడమే కాకుండా, భవిష్యత్తులో సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రతకు ఉపయోగపడే విధంగా పూర్తిగా డాక్యుమెంట్ చేస్తామని తెలిపారు.

### సోమవారం మత్స్యకారులతో ప్రత్యేక బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మత్స్యకారులతో ప్రత్యేకంగా చర్చించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు.

మత్స్యకారులు జిల్లాకు చేరుకున్న అనంతరం సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ప్రత్యేక బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ నిర్వహిస్తామని చెప్పారు. సముద్రంలోకి వెళ్లే సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, బోట్లలో అత్యవసర పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇంజిన్ మరియు గేర్‌బాక్స్‌ల ముందస్తు తనిఖీలు, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించే విధానం తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

మత్స్యకారుల అనుభవాల ఆధారంగా భవిష్యత్తులో మరింత మెరుగైన సముద్ర భద్రతా వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన చర్యలను పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.

### కుటుంబ సభ్యులకు ఊరట

23 రోజులుగా తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు వారి సురక్షిత ఆచూకీ లభించడం ఎంతో ఊరటనిచ్చిందని కలెక్టర్ తెలిపారు. మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు సహకరించిన కోస్ట్‌గార్డ్, నేవీ, వెస్ట్ బెంగాల్ అధికారులు, మెరైన్ పోలీసులు, ఇతర బోటు సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాల అధికారులకు జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారుల సురక్షిత స్వస్థల చేరిక వరకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ క్రీడా ఎంపికలు

నల్లగొండ (బిఎన్ఎస్) : భారత ప్రభుత్వము ప్రతి ఏటా నిర్వహించే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ క్రీడా ఎంపికలు సెప్టెంబర్ 8, 9తేదీలలో నిర్వహిస్తున్నామని సూర్యాపేట జిల్లా యువజన క్రీడల అధికారితెలంగాణ బి వెంకట్ రెడ్డి తెలిపారు... తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వారిచే మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, Best physic, యోగా తదితర అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు.. ఈ టోర్నమెంట్ లలో పాల్గొనదలచిన సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తమ యొక్క ఎంప్లాయ్ ఐడి కార్డ్ ఒరిజినల్ తోపాటు రెండు జిరాక్స్ కాపీలతో సెప్టెంబర్ 3వ తేదీ న ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట లోపు సూర్యాపేట లోని జిల్లా యువజన, క్రీడల కార్యాలయములో పేరు నమోదు చేసుకోవలసినదిగా కోరారు.. . మరిన్ని వివరాల కోసం 9100949979 నెంబర్ లో సంప్రదించవలసిందిగా కోరారు...

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు
## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నల్లగొండ (బిఎన్ఎస్): హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు... జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణ కోసం జిల్లా కలెక్టరేట్ లో నల్లగొండ జిల్లా స్థాయి జాతీయ రహదారి టాస్క్ ఫోర్స్ కమిటీ సమవ్వహం నిర్వహించారు.. అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ రహదారిపై సంభవిస్తున్న రహదారి ప్రమాదాల పై సమీక్షించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రమాదాల నివారణ కు హైవే పెట్రోలింగ్ పెంచడంతోపాటు, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో హోటళ్లు, దాబాలు, మెకానిక్ షాప్ లు సెట్ బ్యాక్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వాటిని యంత్రాల సాయంతో తొలగించాలని అన్నారు.. , .

రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసే సూచిక బోర్డులతో పాటు, దాబాలు, హోటళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై మరోసారి పూర్తిస్థాయిలో డ్రైవర్లు,ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.. జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రతి 30, 40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అంబులెన్స్, క్రేన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.. ప్రమాదాలు సంబంధించినప్పుడు అంబులెన్స్, ఆసుపత్రి సిబ్బంది, పోలీసు, హైవే పెట్రోల్ సిబ్బంది తో పాటు, సంబంధిత శాఖలందరూ స్పందించాల్సిన అవసరం ఉందని, అలాగే డ్రైవర్లు నిరంతరం డ్రైవింగ్ చేయకుండ ప్రతి 2 గంటలకు ఒకసారి ఆగి తిరిగి డ్రైవింగ్ చేసేలా అవగాహన కల్పించాలని, 80 కిలోమీటర్లు మించి వేగం వెళ్లకుండా నియంత్రించాలని సూచించారు.. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారికి కఠిన జరిమానాలు విధించాలని, ట్రక్కులకు, లారీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రక్ లే బేస్ లలో మాత్రమే వాహనాలు నిలిపేలా చూడాలని, నో పార్కింగ్ స్థలాలలో ఎట్టి పరిస్థితులలో వాహనాలు నిలపకుండా చూడాలని అన్నారు..

# నేడు కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్న నేదురుమల్లి



ఉమ్మడి నెల్లూరు వెంకటగిరి (బిఎన్ఎస్):- నేడు అనగా 28-08-2026 వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్ లకు ,నేదురుమల్లి కుటుంభం అభిమానులకు అందుబాటులో ఉండనున్నారు అని వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ కార్యాలయం నుండి ప్రకటనలో తెలిపారు.

# రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం గుర్తించాలి..

**అభివృద్ధి చేసిన పార్టీని ఆదరించాలి.**
**టిడిపి కడపజిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో అన్ని రంగాలలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేశాము, ఎన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పెట్టాము, అనేటువంటి అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిన పార్టీకే మద్దతు పలకాలని టిడిపి కడపజిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి తెలిపారు. ఈరోజు జమ్మలమడుగు పట్టణం 3 వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మొదటగా పెద్దపసుపుల మోటు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూపేష్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి టీచర్స్ కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన రెండు సంవత్సరాల పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ మరియు జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి పాలనలో జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అన్ని రంగాలలో అభివృద్ధి పనులు చేశామని, సిమెంట్ ఫ్యాక్టరీలు, స్టీల్ ప్లాంట్, మరియు సోలార్ ఫ్యాక్టరీలు, విండ్ పవర్ ఫ్యాక్టరీలు ఇలా ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేస్తూ జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు కొనసాగు తున్నామని, అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గాన్ని ఏ పార్టీ వారు అభివృద్ధి చేశారో గుర్తించి మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వానికి తమ విలువైన ఓటు వేసి, వేయించి గెలిపించాలని ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, క్లస్టర్ బాల పుల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, గౌస్ పీర్, శంకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో ఘనంగా అవినాష్ రెడ్డి 42 వ పుట్టినరోజు వేడుకలు.

**వైయస్ అవినాష్ రెడ్డి వందేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలి.**
**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో ప్రతి చోట పోటీ చేస్తాం.**
**వైయస్సార్సీపి ఎస్ఈసి సభ్యులు పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:

కడపజిల్లాకు మూడు సార్లు ఎంపీగా గెలిచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి ఒక్కనాయకుని, కార్యకర్తల మనసును గెలుచుకుని వారి మనసులో గొప్ప నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్న వైఎస్ అవినాష్ రెడ్డి 42 వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా జమ్మలమడుగు పట్టణం లోని స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో వైసిపి ఎస్ఇసి సభ్యులు పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి మున్సిపల్ విభాగము జిల్లా అధ్యక్షులు వల్లంబాయి రుషికేశవరెడ్డి అధ్యక్షతన వైఎస్ దుష్యంత్ రెడ్డి, వైసీపీ నాయకులు కార్యకర్తలు కలిసి వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నిరంతరం కార్యకర్తల శ్రేయస్సు కోసమే పని చేస్తున్నారని తెలిపారు. అనంతరం మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు వల్లంభాయ్ ఋషికేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అవినాష్ రెడ్డి వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తకు న్యాయం చేస్తూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైయస్సార్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ అవినాష్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ పార్టీ తరఫున పోటీలో నిలబడే ప్రతి అభ్యర్థికి ఆయన మద్దతు ఉంటుందని ప్రతి వార్డులోను, ప్రతి నియోజక వర్గంలోను, వైసీపీ తరఫున నిలిచే ప్రతి అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తారని తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ముల్లా జానీ, జగదీశ్వర్ రెడ్డి, కొమెర్ల మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సింగరయ్యా, ఆంజనేయులు యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ భాషా, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు వైయస్సార్ పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం వైయస్ అవినాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు పాల్గొన్న నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఆత్మీయ విందు అందజేశారు.